క్లుప్తంగా

రాచూర్‌లో వీరనాగమ్మ ఉత్సవాలు



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో అరెకటిక కులస్తులు శుక్రవారం ఘనంగా వీరనాగమ్మ పండుగ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారి కల్యాణోత్సవం కనులవిందుగా కొనసాగింది. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని కుమ్మెరలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మెర గ్రామానికి చెందిన రైతు పానుగంటి కృష్ణయ్య పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకుంది. గమనించిన రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదంలో రూ.4 లక్షలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి కృష్ణమూర్తి తెలిపారు.

బైపాస్ బాధితులకు న్యాయం చేయాలి

చారకొండ: మండల కేంద్రంలో జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి న్యాయం చేయాలని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన 29 మంది ఇళ్లు బైపాస్ రోడ్డు నిర్మాణంలో కోల్పోయారని వారికిచ్చిన పరిహారంతో వారు ఏమి చేయలేని స్థితిలో ఉన్నారని, వారిని న్యాయం చేయని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వారి వెంట ధర్మసమాజ్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కల్వకుర్తి రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మాజీ ఉపసర్పంచ్ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కురుమిద్దలో ప్రీమియర్ లీగ్ ట్వంటీ 20 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాడ్మింటన్, తైక్వాండోలో శిక్షణ శిబిరాలను శుక్రవారం ఎస్‌ఐ రామన్‌గౌడ్, ఎంపీటీసీ సుమలత శేషంద్రాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో తైక్వాండాలో గోల్డ్ మెడల్ సాధించిన అమృతని అభినందించి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మూలె కుమార్, కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

బిజినేపల్లి: పేదలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. వెల్గొండ గ్రామానికి చెందిన దిడ్డి రాములమ్మ భర్త ఐదు సంవత్సరాల కిందట విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ మేరకు విద్యుత్‌శాఖ నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం ప్రమాదబీమా చెక్కును క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఆవంతి, కాంగ్రెస్ నాయకులు మస్కూరి శంకర్, పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

నాగర్‌కర్నూల్ రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గన్యాగుల, పెద్దముద్దునూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతుధర పొందాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, గన్యాగుల అధ్యక్షుడు కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కోటయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గన్యాగులలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐకేపీ ఏపీఎం పార్వతమ్మ పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

వెల్దండ: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని ఏఈఓ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో రైతుల వరిధాన్యాన్ని ఆయన పరిశీలించారు. వరికి మద్దతు ధర ఏ గ్రేడ్ వారికి రూ.2320, బీ గ్రేడ్ వారికి రూ.2300లు చెల్లిస్తుందన్నారు. అదే విధంగా సన్నరకం వరి ధాన్యానికి అదనంగా రూ.500 చెల్లిస్తుందన్నారు. వరిధాన్యం కేంద్రాల్లోని ధాన్యం విక్రయించాలన్నారు. అనంతరం తేమశాతం పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్ విండో సిబ్బంది, తదితరులు ఉన్నారు.



రాజాపూర్‌లో..



పెద్దాపూర్‌లో

సీపీఐతోనే కార్మికులకు న్యాయం

తెలకపల్లి: సీపీఐతోనే కార్మికులకు న్యాయం చేకూరుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు ఎం బాలనర్సింహ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో మే డే వారోత్సవాలలో భాగంగా సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక విప్లవం కార్మికుల జీవితాలను మార్చి వేసిందన్నారు. మేడే సెలవు దినం కాదని కార్మికుల ఐక్యతను గుర్తు చేసే రోజ అని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు కేశవులు గౌడు, శంకర్‌గౌడ్, మండల కార్యదర్శి వెనేపల్లి రవిందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయుడు దస్తగిరి నరేందర్‌రెడ్డి, బీమయ్య, లాల్ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న బాల్‌నర్సింహ

ఘనంగా సామూహిక కుంకుమార్చన



అచ్చంపేటలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

అచ్చంపేట/అచ్చంపేట రూరల్: పట్టణంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం భ్రమరాంబ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉదయం 8 గంటల నుంచి ప్రతిష్ఠ యాగశాల వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనము, గోపూజ, యాగ మండపారాధనలు, బ్రహ్మకలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అలాగే సాయంత్రం పోచమ్మ అమ్మవారి విగ్రహాలకు భక్తులు ధాన్యాధి వాసం ఏర్పాటు చేశారు. అనంతరం మంగళహారతిని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, సతీష్ చారి, చంద్రమోహన్, రఘురాం, కోట కిషోర్, రమేష్‌రావు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

కొల్లాపూర్ రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ముక్కిడిగుండంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు కాని ఇప్పటివరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నీలమ్మ, అలివేలమ్మ, గోపాల్, రాముడు, లచ్చమ్మ, పార్వతమ్మ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ల జారీలో నిబంధనలు సడలించాలి

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వ్యవసాయ శాఖ వారు అందజేసే టోకెన్ల జారీలో ఉన్న నిబంధనలు సడలించాలని మండల రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ టోకెన్లు జారీ చేస్తేనే కేంద్రాల్లో ధాన్యం కాంటా చేస్తున్నారని, ఈ టోకన్ల జారీలో ఎకరాకు 32 క్వింటాళ్ల చొప్పున (కుంటకు 02 బస్తాల చొప్పున) దిగుబడి వస్తుందనే అంచనాలతో అధికారులు టోకెన్లను జారీ చేస్తున్నారు. కానీ వాస్తావానికి ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. మరి మిగిలిన 3 క్వింటాళ్ల ధాన్యం ఏమి చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎకరాకు ఉన్న నిబంధనలను సడలించి టోకెన్లను అందజేసి ఇబ్బందులను తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు. శుక్రవారం చాలా మంది రైతులు టోకన్ల జారీ విషయంలో ఏఈఓలను ప్రశ్నించారు. ఈ విషయంపై ఏఓ రాజవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. ప్రభుత్వం ఎకరాకు 32 క్వింటాళ్ల దిగుబడి లెక్కన టోకెన్లను అందజేస్తున్నామని రైతుల అభిప్రాయాలను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు.



ధాన్యం టోకెన్ల కోసం గుమికూడిన రైతులు

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని మద్రిగుంతతండా, గాజులోనిబావితండాలో ఏపీఓ ఈశ్వర్‌జీ ఆధ్వర్యంలో ఇళ్ల సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ అర్హులైన వారందరికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. మంజూరైన ఇళ్ల నిర్మాణం వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం ఇళ్లు నిర్మిస్తే విడతల వారికి రూ.5లక్షలు నిధులు విడుదల అవుతాయన్నారు. ఇళ్లు లేని వారిని మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బావితండాలో ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు

అంగన్‌వాడీ కార్మికులను క్రమబద్ధీకరించాలి



కల్వకుర్తి రూరల్: అంగన్‌వాడీ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ సుదర్శనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించి అంగన్‌వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.32000 ఆయాకు రూ.6000 ఇవ్వాలన్నారు. 20న నిర్వహించే సమ్మెలో పాల్గొంటునట్లు వివరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



చారకొండ: ప్రతిఒక్కరికి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శంషోద్దిన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో శుక్రవారం పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై, కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాకింగ్ వివరాలు చెప్పొద్దన్నారు. సైబర్ నేరగాళ్లబారిన పడిన వారు సంబంధిత పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ తిరుమల్ రావు, కానిస్టేబుల్ బాలరాజు, తదితరులు ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: అక్రమంగా పొలంలో కడీలు పాతి, డబ్బులు, భూమి డిమాండ్ చేసిన ఘటనలో శుక్రవారం కేసు నమోదైనట్లు ప్రొహిబిషన్ ఎస్‌ఐ హిమబిందు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేమద్దులకు చెందిన శ్రీరాంరెడ్డికి గ్రామ శివారులోని సర్వే నంబర్ 468లో 4.20 ఎకరాల భూమి ఉంది. ఆయన స్థానికంగా లేకపోవడంతో ఇదే గ్రామానికి చెందిన రంగాపురం సుధాకర్‌రెడ్డి 10 రోజుల క్రితం శ్రీరాంరెడ్డి పొలంలో 15 సిమెంటు కడీలు పాతి భూమి అక్రమించే ప్రయత్నం చేశాడన్నారు. విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న శ్రీరాంరెడ్డి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిందితుడిపై ఫిర్యాదు చేశాడు.

పొలంలో కడీలు పాతడంతో పాటు గతంలో దౌర్జన్యంగా డబ్బులు, భూమి డిమాండ్ చేసిన రంగాపురం సుధాకర్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్మికుల హక్కులు కాపాడుకుందాం

పెంట్లవెల్లి: కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మే డే వారోత్సవాలలో భాగంగా కొత్త బస్టాండ్‌లోని సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమంతు, ఎల్లగౌడ్, చిట్టెమ్మ, శివలీల, కృష్ణయ్య, రమాదేవి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తబస్టాండ్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్

అధికారుల నిర్లక్ష్యం



లింగాల: వారం రోజుల కిందట మండల కార్యాలయాల సముదాయంలో మధ్యలో ఈదురు గాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టును తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వివిధ పనులకు వచ్చే ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఉండటంతో వరి ధాన్యం తీసుకవచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడే ఉన్న తహసీల్దార్, మండల పరిషత్, ఐకేపీ, ఉపాధి హామీ పథకం కార్యాలయాలు ఉన్నప్పటికి ఏ అధికారి కూడా స్పందించడం లేదని ప్రజలు విమర్శలు వినిపిస్తున్నాయి. ట్టును వెంటనే తొగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రిన్సిపల్ జడ్జికి సన్మానం



కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి ఉపనిషద్వాని బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సన్మానించారు. ఇటీవల బదిలీపై వచ్చి గురువారం కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం విధులకు హాజరైన జడ్జిని న్యాయవాదులు కలిశారు. బార్ అసోసియేషన్ చాంబర్‌లో జడ్జికి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నాగరాజు, న్యాయవాదులు శ్రీనివాసరావు, ఉపేందర్, కర్నె శ్రీహరి, నజీరోద్దీన్, బాలస్వామి, మోహన్‌లాల్, మనోహర్, మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందన



చారకొండ: ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పగడాల సంతోష్ 510 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యార్థి సంతోష్‌ను శాలువాతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణులైన పదో తరగతి విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. శుక్రవారం పాఠశాలలో శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామన్‌గౌడ్, బజీర్, కురుమయ్య, చక్రపాణి, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



తాడూరు: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బాలకిష్టయ్యకు సంబంధించిన గడ్డివాముకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆపారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన గోడవర్ల నిరంజనమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి అంత్యక్రియల కోసం రూ. 3 వేల ఆర్థికసాయం అందజేశారు.

జన, కులగణన నిర్ణయం చారిత్రాత్మకం

కందనూలు: దేశంలో జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాము అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించారు. కులగణనతో బీసీలకు రాజకీయ, సామాజిక పరంగా విద్య, ఉద్యోగాలలో అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్, సైదులు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు చందు, ఓబీసీ నేత లక్ష్మయ్య, సూరంపల్లి సుధాకర్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

అచ్చంపేట రూరల్: దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణనను చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. బీజేపీ నాయకులు మంగ్యానాయక్, శ్రీనునాయక్, రామచంద్రయ్య, పత్యానాయక్, తేజస్విని, రవీందర్, శివచంద్ర, అమర్, శరత్, అభినయ్, అజయ్, సుబ్బయ్యగౌడ్, శేఖర్‌గౌడ్, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి: జనగణనతో పాటు కుల గణన చేయాలని క్యాబినేట్‌లో నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి బీజేపీ కార్యకర్తలు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల శ్రీరాములు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుమ్మకొండ భూషయ్య, నాయకులు నారాయణాచారి, రఘుబాబు, తిరుపతయ్య, రంజిత్, వెంకటేష్, మహేష్, నరసింహ్మా, సత్యం, రమేష్‌గౌడ్, నిరంజన్, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.



బిజినేపల్లిలో..

పీఎం చిత్రపటానికి పాలాభిషేకం

లింగాల: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, విష్ణు, ఇల్లెందుల శ్రీను, మహేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

జన,కుల గణనపై హర్షం

కొల్లాపూర్: జన, కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆకునమోని చంద్రయ్య యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుల గణన పారదర్శకంగా చేపట్టాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రూ.5 లక్షలతో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం పూర్తయ్యింది. శుక్రవారం మోడల్ ఇంటిని పూర్తి స్థాయి నిర్మించి లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మించినట్లు ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. మండలంలో పేదలకు 634 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.



ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మించిన మోడల్ హౌస్